సాక్షి అనంతపురం

సోమవారం ၊ 10 ၊ ఫిబ్రవరి ၊ 2025



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం టమాట కిలో గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



యువతి ఆత్మహత్య..

ప్రేమ పేరుతో యువకుడు వేధిస్తుండటంతో తట్టుకోలేక యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో జరిగింది. 8లో

గరిష్టం/కనిష్టం
35.8°/15.2°

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాం నుంచి పీఏబీఆర్‌కు నీటి సరఫరా బంద్

- హంద్రీ-నీవా నుంచి 360 క్యూసెక్కుల సరఫరా



పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు తుంగభద్ర జలాశయం నుంచి నీటి సరఫరా శనివారం నిలిచిపోయింది. ప్రస్తుతం హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా 360 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లో చేరుతోంది. ఆదివారం నాటికి డ్యాంలో 3.70 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ధర్మవరం కుడి కాలువకు 705 క్యూసెక్కులు, అనంతపురం, సత్యసాయి, శ్రీరామరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు రూ.55 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ఇన్‌ఫ్లో కంటే అవుట్ ఫ్లో ఎక్కువగా నమోదవుతోంది.

నేడు 'పరీక్ష పే చర్చ'

- అన్ని పాఠశాలల్లో ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు



అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడేందుకు దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం నిర్వహించే 'పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో వీక్షించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఉదయం 11 గంటలకు దూరదర్శన్ ద్వారా డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ ఇండియా, రేడియో ఛానళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. https://www. youtube.com/watch?v= G5Uhdwm-EEI లింక్ ద్వారా లైవ్‌లో చూడొచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా పదో తరగతి విద్యార్థులను కార్యక్రమానికి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. 6 నుంచి 9, ఇంటర్ విద్యార్థులందరూ వీక్షించేలా చర్యలు తీసుకోవాలని డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లను డీఈఓ ఆదేశించారు.

15 మంది రైతుల తోటల్లో మోటారు వైర్ల అపహరణ

శింగనమల: మండలంలోని పెద్ద మట్లగొంది, చిన్న మట్లగొంది గ్రామాల్లోని 15 మంది రైతులకు చెందిన తోటల్లో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. వ్యవసాయ బోరుబావుల్లోని మోటార్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్‌ను అపహరించారు. ఒకే నెలలో మూడు సార్లు కేబుల్‌ను దుండగులు అపహరించుకెళ్లడం గమనార్హం. చోరీ జరిగిన ప్రతిసారీ రైతులు కొత్త వైర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటిని వారం తిరగకముందే మరోసారి దుండగులు అపహరించుకెళుతున్నారు. ఘటనపై ఆదివారం పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

హా..స్పత్రి!

- రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో సమస్యల తిష్ట
- తీవ్రంగా వైద్యులు, సిబ్బంది కొరత
- కీలక విభాగాల్లో కుర్చీలు ఖాళీ
- పేదలకు తప్పని ఇబ్బందులు



ఆగిన రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు



రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో బారులుదీరిన రోగులు

రాయదుర్గం: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సరిపడా వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండేవారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీలు, ఇతర కారణాలు వెరసి 23 మంది వైద్యులకు గానూ ప్రస్తుతం 12 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నారు. 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కంటి డాక్టర్, చిన్నపిల్లలు, పంటి, ఈఎన్‌టీ, మత్తు, కాన్పులు, ఎముకలు, రేడియాలజీ లాంటి కీలక విభాగాలకు వైద్యులు లేకపోవడం గమనార్హం.

రోగుల నరకయాతన..

ఆస్పత్రిలో వైద్యులే కాకుండా నర్సులు, ఇతర విభాగాల్లో సరిపడునంత సిబ్బంది కూడా లేరు. మొత్తం 73 మంది సిబ్బంది అవసరముండగా, కేవలం 23 మంది ఉన్నారు. దీంతో ఉన్నవారిపై అదనపు భారం పడుతోంది. ఇటీవల ఆస్పత్రి సందర్శనకు వచ్చిన డీసీహెచ్ పాల్ రవికుమార్ చిన్నపిల్లలు, ఎముకల డాక్టర్లతో పాటు ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామన్నా ఇప్పటికీ అతీగతీ లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆస్పత్రికి వచ్చే పేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల పాటు క్యూలో నిల్చోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక.. ఆస్పత్రిలో రోగులకు అందించే భోజనంలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేదలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దుస్థితిని పారదోలాల్సి ఉంది.

రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

ప్రతి రోజూ ఓపీ	500-600 మంది
ఐపీ	50-70 మంది
ఉండాల్సిన వైద్యులు	23
ప్రస్తుతం ఉన్న వైద్యులు	12
నర్సింగ్, ఇతర విభాగాల్లో ఉండాల్సిన సిబ్బంది	73
ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది	23

కూటమి సర్కారు శాపం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆస్పత్రి రూపురేఖలు మారాయి. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూ.కోట్ల విలువైన అత్యాధునిక యంత్రాలను సమకూర్చారు. సీహెచ్‌సీని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. నూతనంగా ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన పనులు మందగించాయి. 8 నెలలుగా నత్తతో పోటీ పడుతున్నాయి. దీంతో ఆస్పత్రిలో 40 బెడ్ల తోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఒకే బెడ్డుపై ఇద్దరు లేదా ముగ్గురికి చికిత్సలందించాల్సిన దుస్థితి నెలకొంది.

వైద్యులను నియమించాలి



రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి నిత్యం వందలాది మంది పేదలు చికిత్సల కోసం వస్తుంటారు. తగినంత సిబ్బంది లేక వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆస్పత్రిలో వైద్య పోస్టులన్నీ భర్తీ చేసి, రోగులకు మెరుగైన సేవలు అందించాలి. ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– గోనబావి సర్మస్, రాయదుర్గం

అధికారులకు నివేదించాం



ఆస్పత్రిలో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపాం. త్వరలో చిన్న పిల్లలు, ఎముకల వైద్యులను నియమించే అవకాశం ఉంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి నోటిఫికేషన్ రానుంది. ఆస్పత్రి అంతటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. రోగులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూస్తాం.

– మెర్సీ జ్ఞానసుధ, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం ఆస్పత్రి

హనుమద్వాహనం.. శ్రీవారి రాజసం



హనుమద్వాహనంపై కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కొండమీద రాయుడు హనుమద్వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ పుర వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. మహిళలు శ్రీవారికి మంగళ హారతులు పట్టారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సోమవారం రాత్రి శ్రీవారిని గరుడు వాహనంపై ఊరేగించనున్నట్లు అర్చకులు శ్రీనాథ్ స్వామి పేర్కొన్నారు.

నేటి నుంచి 'పది' ప్రీ ఫైనల్

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ప్రీఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే ప్రశ్నపత్రాలు ఆయా మండలాల్లోని ఎమ్మార్సీలకు తరలించారు. సోమవారం మొదటి లాంగ్వేజ్, 11న ద్వితీయ లాంగ్వేజ్, 12న ఇంగ్లిష్, 15న గణితం, 17న ఫిజికల్ సైన్స్, 18న బయాలజికల్ సైన్స్, 20న సోషల్ పరీక్ష ఉంటుందని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు తెలిపారు.

క్షీణిస్తున్న భూగర్భ జలం

- జిల్లా తాజా నగటు నీటి మట్టం 9.73 మీటర్లు
- 17 మండలాల్లో అధికంగా నీటి ఒత్తిడి



అనంతపురం అగ్రికల్చర్: శాస్త్రీయ పద్ధతుల్లో భూగర్భజలాల స్థితిగతులు తెలుసుకునే నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 31 మండలాల పరిధిలో 97 ఫిజోమీటర్లు ఏర్పాటు చేశారు. భూగర్భ జలశాఖ తాజాగా సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లా సగటు నీటి మట్టం 9.73 మీటర్లుగా నమోదైంది. 17 మండలాల పరిధిలో ఉన్న 29 ఫిజోమీటర్ల పరిధిలో భూగర్భజలాలు క్షీణిస్తున్నట్లు గుర్తించామని ఆ శాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు. యాడికి మండలం రాయలచెరువు ఫిజోమీటర్‌లో గరిష్టంగా 36.36 మీటర్లలో నీటిమట్టం కనిపిస్తుండగా, అదే మండలం నగరూరులో 31.17 మీటర్లు, శెట్టూరు ఫిజోమీటర్‌లో 28.12 మీటర్లలో గుర్తించినట్లు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటి కన్నా అధికంగా వినియోగిస్తుండటం వల్ల వేసవిలో అక్కడక్కడా సమస్య తలెత్తే పరిస్థితి ఉందన్నారు. గతేడాది ఇదే సమయంలో సగటు నీటి మట్టం 11.20 మీటర్లుగా నమోదైందని, ఈ సారి మాత్రం 29 ఫిజోమీటర్ల పరిధిలో క్షీణిస్తుండటం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు.

30 శాతం అధికంగా వర్షపాతం..

ఈ వర్షపు సంవత్సరానికి సంబంధించి గత జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 460.7 మి.మీ గానూ 30 శాతం అధికంగా 601.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో 14 మండలాల్లో భూగర్భజలాలు కొంత మెరుగ్గానే ఉన్నా మిగతా మండలాల్లో కొంత తగ్గుతున్నట్లు గుర్తించారు. అనంతపురం, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, డీ.హీరేహాళ్, గుత్తి, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, కూడేరు, కుందుర్పి, నార్పల, పామిడి, పుట్లూరు, శెట్టూరు, తాడిపత్రి, యాడికి... తదితర 17 మండలాల్లో భూగర్భ జలాలు ఒత్తిడికి గురవుతున్నట్లు గుర్తించారు. ఆయా మండలాల్లో నీటిని అధికంగా వినియోగించే వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేయకుండా ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలని భూగర్భజలశాఖ సిఫారసు చేసింది. ఉపాధి హామీ పథకం కింద విరివిగా నీటికుంటల నిర్మాణాలు చేపట్టి వాన నీటిని ఎక్కడిక్కడ ఇంకేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సూచించింది. పంటల సాగుతో డ్రిప్ ద్వారా నీటి ఆదా చర్యలు చేపట్టాలని సిఫారసు చేశారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- 'పరిటాల' డైరెక్షన్‌లోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. కనగానపల్లి మండలం గుంతపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి నరసింహులుపై హత్యాయత్నం దారుణమని పేర్కొన్నారు. అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు చాకలి నరసింహులును ఆదివారం సాయంత్రం గోరంట్ల మాధవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చాకలి నరసింహులు క్రియాశీలకంగా ఉండేవాడన్నారు. పరిటాల సునీతమ్మ, పరిటాల శ్రీరామ్ డైరెక్షన్‌లోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. హత్యా రాజకీయాలను మొదలుపెడితే పరిటాల కుటుంబంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉండేవని గుర్తు చేశారు. ప్రశాంతతను చెడగొట్టేలా పరిటాల కుటుంబం వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి దారుణాలను ప్రోత్సహిస్తే పుట్టగతులుండవని, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యా రాజకీయాలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని, ధనుంజయ యాదవ్, అమర్‌నాథ్‌రెడ్డి, గుంతపల్లి ఆనందరెడ్డి, మోహన్‌బాబు, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.



ఆస్పత్రిలో బాధితుడు చాకలి నరసింహులును పరామర్శిస్తున్న గోరంట్ల మాధవ్

కూతుర్ని పంపమంటూ పదేపదే వేధించాడు

- అధికారుల ఎదుట కన్నీటిపర్యంతమైన నాగమునెమ్మ



విచారణకు వచ్చి కార్యాలయ ఆవరణలో భోజనం చేస్తున్న నాగమునెమ్మ

తాడిపత్రిటౌన్: రేషన్ కార్డు కోసం వెళ్లిన ప్రతిసారీ 'నీ కూతుర్ని పంపు' అంటూ వీఆర్‌ఓ చంద్రశేఖర్ వేధించాడంటూ అధికారుల ఎదుట నాగమునెమ్మ కన్నీళ్లు పెట్టుకున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వీఆర్‌ఓ కీచక పర్వంపై ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి,ఆర్‌డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ రజాక్ వలి, సీఐ సాయిప్రసాద్ విచారణ చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు నాగమునెమ్మను విచారించారు. 'కూతుర్ని పంపు అని వీఆర్వో ఎప్పుడు అన్నాడు, ఏ సమయంలో అన్నాడు, అన్నప్పుడు ఎవరెవరున్నారు' అంటూ సీఐ సాయిప్రసాద్ ప్రశ్నించినట్లు తెలిసింది. రేషన్‌కార్డు కోసం వెళ్లిన ప్రతి సారీ ఆ మాట అన్నాడని, తాను ఒక్కదాన్నే ఉన్న సమయంలోనే అలా మాట్లాడాడని నాగమునెమ్మ చెప్పినట్లు సమాచారం. విచారణ అనంతరం బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ అన్యాయాన్ని అధికారులకు చెప్పుకున్నానని, న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్‌డీఓ కేశవనాయుడు మాట్లాడుతూ బాధితురాలు నాగమునెమ్మతో పాటు నిందితుడైన వీఆర్వో చంద్రశేఖర్‌ను, సచివాలయ సిబ్బందిని విచారించామన్నారు. వాదనలను రికార్డు చేశామని, నివేదికలను కలెక్టర్‌కు అందించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, నాగమునెమ్మను విచారిస్తున్న సమయంలో విలేకరులను అధికారులు లోనికి అనుమతించలేదు.

అశ్వత్థం.. భక్తజన సందోహం



ప్రత్యేక అలంకరణలో సింగరభట్లు, గణపతి, అశ్వత్థనారాయణస్వామి విగ్రహాలు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్న పప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రానికి రెండవ ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ గార్లదిన్నె బీసీ రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. డాక్టర్ ఉషారాణి, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాష్ వలి పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సేవాసంస్థల సభ్యులు శంకర్, పి.నారాయణ, గురప్ప, రామాంజినేయులు, పాండురంగ తదితరులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లు.. ఘొల్లు

- ఒకేసారి మూడు రెట్లు పెంచిన కూటమి ప్రభుత్వం
- 'రెండో ముంబై' పామిడివాసులపై పెనుభారం
- సర్కారు తీరుపై సర్వత్రా ఆగ్రహం



పామిడి: విద్యుత్ బిల్లుల పెంపు పేదలకు పెను భారంగా మారింది. ఒకే సారి మూడు రెట్ల భారం మోపడంతో అన్ని వర్గాల నుంచి నిరసన పెల్లుబుకుతోంది. వస్త్ర వ్యాపారంలో రెండో ముంబైగా పేరుగాంచిన పామిడివాసులు కూటమి సర్కారు తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. మండలంలో 85 శాతం మంది కుట్టుమిషన్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. డ్రస్‌లను ఇంట్లోనే కుడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. మహిళలు కుట్టుమిషన్లపై ఆధారపడి కుటుంబానికి చేయూతగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో వారంతా మిషన్లకు విద్యుత్ మోటార్లను అనుసంధానించి సులభంగా, వేగంగా దుస్తులు కుట్టేవారు. అయితే, ఇటీవల కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు భారీగా పెంచి మోయలేని భారం మోపడంతో వారంతా ఘొల్లుమంటున్నారు. గతంలో రూ.500 వచ్చే బిల్లు ఒక్కసారిగా రూ.1,500కు చేరడంతో వారి ఆవేదన అంతా ఇంతా కాదు.

గతంలో రూ. 200.. నేడు రూ.467



కరెంటు బిల్లులు తగ్గడమేమో గానీ ఏకంగా వందల రూపాయల్లో పెంచారు. గతంలో నా ఇంటికి ప్రతి నెలా రూ.200 దాకా కరెంటు బిల్లు వచ్చేది. ఈ సారి ఏకంగా రూ.467 వచ్చింది. ఇలా అయితే ముమ్ముందు పేదలు కరెంటు వాడాలంటే కూడా భయపడాల్సిన పరిస్థితి.

– ఎస్ రమేష్, దేవరపల్లి గ్రామం, పామిడి మండలం

బతుకు భారం



మూమూలుగా ప్రతినెలా రూ.500 వచ్చే బిల్లు ఈ సారి ఏకంగా రూ.1,500కు చేరింది. రెక్కాడితే గాని డొక్కాడని మాలాంటి పేదలకు విద్యుత్ బిల్లులను చెల్లించడం సులువు కాదు. ప్రభుత్వ తీరుతో కరెంటు గురించి తలుచుకుంటేనే భయమేస్తోంది. కరెంటు వాడకం కంటే పాతరోజుల్లోలాగా బుడ్డీలే మేలేమో అనిపిస్తోంది. విద్యుత్ చార్జీలను తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

–పీ. రజని, పామిడి

కుట్టుమిషన్లు మూలకు పడతాయి



పామిడి మండలంలో 85 శాతం మంది కుట్టుమిషన్లపై ఆధారపడి జీవిస్తున్నారు. మిషన్లకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుని సులువుగా కుడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఒకేసారి బిల్లులను మూడురెట్లు పెంచడంతో పేదలకు పెనుభారంగా మారింది. కుట్టుమిషన్లు మూలకుపడే ఆస్కారం లేకపోలేదు.

–కే రహీమ్, సీపీఐ నాయకులు, పామిడి

క్లుప్తంగా

ఏపీ జట్టు జూడో కోచ్‌గా చిగిచెర్ల పీడీ ప్రతాపరెడ్డి


జూడో అసోసియేషన్ ప్రతినిధులతో పీడీ ప్రతాపరెడ్డి

ధర్మవరం రూరల్: జాతీయ స్థాయి జూడో పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు కోచ్‌గా చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ప్రతాపరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే 38వ జాతీయ క్రీడా పోటీల్లోల ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పామిడి: స్థానిక వెంగమనాయుడు కాలనీలో నివాసముంటున్న శ్రీనివాసరెడ్డి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనానికి శ్రీనివాసరెడ్డి వెళ్లాడు. దర్శనం చేసుకొని అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తలుపులు ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించిన దుండగులు... బీరువాలోని 20 తులాల బంగారు నగలను అపహరించారు. సమాచారం అందుకున్న సీఐ యుగంధర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్

పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ పేరుతో దుండగుడు ఓ డాక్టర్‌కు ఎర వేశాడు. ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్‌లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని ఎర వేశాడు. ఈ ఫోన్‌కాల్ స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలో సత్యసాయి క్లినిక్ నడుపుతున్న డాక్టర్ గోపాల్‌రెడ్డికి ఆదివారం ఉదయం 6300805117 నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్‌నంటూ పరిచయం చేసుకున్నాడు. ట్రేడ్ లైసెన్స్ జనవరి 31తో ముగిసిందని, ఆన్‌లైన్ ద్వారా రెన్యూవల్ చేసుకోవాలని సలహా ఇచ్చాడు. అయితే అప్పటికే డాక్టర్ గోపాల్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో పరిచయం ఉండటంతో ఆ వాయిస్ కమిషనర్‌ది కాదని గుర్తించారు. తాను ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ దరఖాస్తు చేసుకోలేదని, పైగా తనకు కమిషనర్ తెలుసని చెప్పడంతో దుండగుడు ఫోన్‌కాల్ కట్ చేశాడు. వెంటనే గోపాల్‌రెడ్డి కమిషనర్ ప్రహ్లాద్‌కు ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్ వస్తే జాగ్రత్తగా ఉండాలని, అలాంటి ఫేక్ కాల్స్ వస్తే రికార్డు చేసి 9515133115 నంబర్‌కు పంపాలని పట్టణ వాసులకు సూచించారు.

కావేటీలో యువకుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్న బాధిత కుటుంబసభ్యులు
- ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన


మృతుడు బ్రహ్మాచారి


కావేటీ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

అనంతపురం మెడికల్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడంటూ మృతుడి భార్యతో పాటు కుటుంబసభ్యులు ఆదివారం ఆందోళనకు దిగారు. వివరాలు... అనంతపురంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన బ్రహ్మాచారి (31) ఈ నెల 6న వడియంపేట వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. అదే రోజు సర్వజనాస్పత్రికి చేర్చిన కుటుంబసభ్యులు... మెరుగైన వైద్యం కోసం స్థానిక అరవిందనగర్‌లోని కావేటి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం బ్రహ్మాచారి కుడి తుంటి ఎముక (ఫీమర్ ఫ్యాక్చర్) అయినట్లుగా అక్కడి అర్థో డాక్టర్ యశ్వంత్ నిర్ధారించి, సర్జరీ చేయాలని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) కార్డు లేకపోవడంతో వైద్యసేవ డీసీకి అర్జీ పెట్టుకున్నారు. డీసీ సిఫారసు మేరకు సీఎంసీఓ నుంచి ఈ నెల 7న రాత్రి అనుమతులు జారీ అయ్యాయి. 8న సర్జరీ చేయాలని నిర్ణయించగా, అదే రోజున బ్రహ్మాచారి పరిస్థితి విషమించింది. దీంతో రోగిని ఫిజీషియన్ డాక్టర్ నూరుల్లా, డాక్టర్ యశ్వంత్ ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో ఆదివారం బ్రహ్మాచారి మృతి చెందాడు.

సకాలంలో శస్త్రచికిత్స చేయలేదు..

బ్రహ్మాచారి మృతి చెందిన విషయం తెలియగానే ఒక్కసారిగా కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. సకాలంలో శస్త్రచికిత్స చేయకుండా వైద్యులు నిర్లక్ష్యం వహించారంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా బాధితులతో కావేటి ఆస్పత్రి నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్, ఎస్‌ఐ రాంబాబు అక్కడకు చేరుకుని బాధితులకు సర్ది చెప్పారు. ఇదిలా ఉండగా బ్రహ్మాచారి మృతికి ఫ్యాట్ ఎంబాలిజమ్ సిండ్రోమ్ కారణమై ఉంటుందని డాక్టర్ యశ్వంత్ తెలిపారు.

మాకు దిక్కెవరు?

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డాక్టర్లు పట్టించుకోకపోతే ఈ నెల 6న కావేటి ఆస్పత్రిలో చేర్పించాం. ఇక్కడ చూస్తే ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు లేకపోవడంతో మొదట రూ.15 వేలు అడ్వాన్స్ కింద కట్టించుకుని, వైద్య సేవ అనుమతి వచ్చిన తర్వాత చేస్తామన్నారు. సీరియస్ కేసు అని చెప్పారు. అయినా ఆపరేషన్ చేయకుండా డబ్బుల కోసం ఆలస్యం చేస్తూ వచ్చారు. వైద్య సేవ అనుమతులు వచ్చి, వీరు ఆపరేషన్ చేసే లోపు నా భర్త ప్రాణాలు వదిలాడు. ఇక మాకు దిక్కెవరు? 11 నెలల పాపను ఎలా పోషించుకోవాలి? కావేటి ఆస్పత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.
– కవిత, మృతుడి భార్య, అనంతపురం

ఆర్టీసీ ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం


నేలకూలిన విద్యుత్ స్తంభం

బొమ్మనహాళ్/బెళుగుప్ప: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ప్రాణ సంకటంలోకి తోసింది. బెళుగుప్ప మండలం నక్కలపల్లి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు... రాయదుర్గం నుంచి బెళుగుప్ప మండలం నక్కలపల్లి మార్గంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం రాయదుర్గం నుంచి బెళుగుప్ప మీదుగా అనంతపురానికి ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు నక్కలపల్లి గ్రామం వద్దకు చేరుకోగానే తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారి షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు ఎగిసి పడుతూ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరిస్తూ బస్సును వెంటనే ముందుకు పోనిచ్చాడు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. నిప్పు రవ్వలు ఎగిసి పడడంతో ఎండు గడ్డికి మంటలు వ్యాపించాయి. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్న విషయాన్ని పలుమార్లు ఆ శాఖ అధికారులకు తెలిపినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వచ్చారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగకపోవడం మంచిదే అయినా.. అన్ని రోజులు ఇలాగే ఉండవని, ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని కోరారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. యువతి ఆత్మహత్య


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలి తల్లిదండ్రులు

రాప్తాడు రూరల్: తనను ప్రేమించాలంటూ ఓ యువకుడి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన దళిత కడప రామచంద్ర, వీరమ్మ దంపతులు స్థానిక ఓ ఇటుకల బట్టీల కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె కడప శిరీష (21) డిగ్రీ చదువుకునే సమయంలో ఉప్పరపల్లికి చెందిన పిన్నదరి వంశీ ప్రేమ పేరుతో వెంటపడేవాడు. శిరీష వారించినా వినేవాడు కాదు. దీంతో తల్లిదండ్రులకు బాధితురాలు తెలపడంతో వారు వంశీని హెచ్చరించారు. అదే సమయంలో విషయాన్ని వంశీ తల్లిదండ్రుల దృష్టికీ తీసుకెళ్లారు. అయినా వంశీలో మార్పు రాలేదు. ప్రేమించాలంటూ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన శిరీష... ఆదివారం ఉదయం ఆరు బయట నాన్నమ్మ వంట చేస్తుండగా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. 12.30 గంటల సమయంలో ఇంటికి వచ్చిన శిరీష సోదరుడు గమనించి వెంటనే తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. చుట్టుపక్కల వరాఉ అక్కడకు చేరుకుని శిరీషను కిందికి దించి పరిశీలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వంశీ కారణంగానే శిరీష మృతి చెందిందంటూ బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారి వెంట ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి నాయకులు రామకృష్ణ, మారెప్ప, ఓబుళపతి, సూరి, స్వామి ఉన్నారు.

రమణీయం.. రథోత్సవం


శిరివరంలో ఊరేగుతున్న కోడిరంగనాథస్వామి


ఆలయంలో వెలసిన కోడిరంగనాథస్వామి

- వైభవంగా కోడిరంగనాథ స్వామి రథోత్సవం
- పురవీధుల గుండా ఊరేగిన స్వామివారు

లేపాక్షి: మేళతాళాలు, కోలాటాలు, వీరభద్రుని వేషధారణతో కళాకారుల విన్యాసాలు..అందరి నోటా గోవింద నామస్మరణే. అందరి మదిలోనూ రంగనాథుడే. మండలంలోని శిరివరం గ్రామంలో వెలిసిన కోడిరంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పలు హోమాలు నిర్వహించారు. అదేవిధంగా రథానికీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామపెద్దలు సమక్షంలో స్వామి వారిని పల్లకీలో రథం వరకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. భారీగా విచ్చేసిన భక్తులతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు రథం లాగేందుకు పోటీపడ్డారు. రంగనాథస్వామి గోవిందా... గోవిందా అంటూ స్వామిని కీర్తించారు. దీంతో శిరివరంలో స్వామివారి నామస్మరణ మార్మోగింది. గ్రామస్తులే కాకుండా మానేపల్లి, చట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, కర్ణాటక ప్రాంతం నుంచి విచ్చేసిన భక్తులు అరటి పండ్లు, ధవనం స్వామి రథంపై విసిరి మొక్కు చెల్లించుకున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవం 2 గంటల వరకు కొనసాగింది. ఉత్సవంలో సర్పంచ్ నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై రంగనాథుడు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నాల్గో రోజు దేవేరులతో కలసి హనుమద్ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. జమ్మిచెట్టు వరకూ ఊరేగించి అనంతరం ఆలయంలో కొలువు దీర్చారు. కాగా, ఆదివారం వేకువజాము నుంచి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమాలను ఆలయ ఈఓ రామాంజనేయులు పర్యవేక్షించారు.

పెనుకొండ కోట అద్భుతం

- శ్రీకృష్ణదేవరాయుల వైభవానికి కట్టడాలే నిదర్శనం
- ట్రావెన్‌కోర్ రాజ వంశీకురాలు గౌరీ లక్ష్మీబాయి


జ్ఞాపికను బహూకరిస్తున్న పట్టణ వాసులు

పెనుకొండ: శ్రీకృష్ణదేవరాయల రాజరిక వైభవానికి తార్కాణంగా నిలుస్తోన్న పెనుకొండ కోట అద్భుతంగా ఉందని కేరళ ట్రావెన్‌కోర్ రాజ వంశీకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గౌరీ లక్ష్మీబాయి అన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని పలు పురాతన కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెనుకొండ రాజరికపు వైభవానికి ఈ కట్టడాలే నిదర్శనమన్నారు. ఈ చారిత్రక కట్టడాలను చూస్తే అలనాటి వైభవం ఎలా ఉండేదో తెలుస్తోందన్నారు. దక్షిణ భారతదేశంలోనే ఒక వెలుగు వెలిగిన విజయనగర సామ్రాజ్యంలోని ఆలయాలు, కోటగోడలు ఇతర కట్టడాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. అనంతరం గోరంట్లలోని ఊరు వాకిలి కోట గోడలు, అక్కడున్న శిలా శాసనాలను ఆమె పరిశీలించారు. చరిత్రకారుడు మైనా స్వామి అక్కడున్న శాసనాలను చదివి గౌరీలక్ష్మీబాయికి వివరించారు. అనంతరం ఆమె ఐముక్తేశ్వరాలయం, రామభద్రాలయం, కాశీ విశ్వేశ్వరాలయం తదితర ఆలయాలను సందర్శించారు. కాశీ విశ్వేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రంగనాథరెడ్డి తదితరులు గౌరీ లక్ష్మీబాయికి జ్ఞాపికను బహూకరించారు.

శాశ్వత బదిలీల చట్టం డ్రాఫ్ట్‌ను బహిర్గతం చేయాలి

- బడుల మూసివేతను అడ్డుకుని తీరుతాం
- ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు


మాట్లాడుతున్న హృదయరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించి కొత్తగా తీసుకురానున్న శాశ్వత బదిలీల చట్టానికి సంబంధించిన డ్రాఫ్ట్‌ను బహిర్గతం చేయాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఐఫియూ చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ (1938) జిల్లాస్థాయి ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన హృదయరాజు, సుబ్బారెడ్డి మాట్లాడారు. జీఓ 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామంటూ ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి పెద్దలు... అధికారంలోకి వచ్చిన తర్వాత మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు పేరుతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్రకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. 20 శాతం పాఠశాలలు ఆదర్శ పాఠశాలలుగా మారితే మిగిలిన 80 శాతం పాఠశాలలు అనాథ పాఠశాలలుగా మారతాయన్నారు. బడుల మూసివేతను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. కిలోమీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమాంతర మాధ్యమాలు, మైనర్ మాధ్యమాలను పునరుద్ధరించాలన్నారు. ప్లస్‌టూ పాఠశాలలను కొనసాగిస్తూ పీజీటీల నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కె.కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫి, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, రవీంద్ర, సత్యప్రసాద్, పోతలయ్య, ఆంజనేయులునాయక్, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ అనుమానాస్పద మృతి

- కేసు నమోదుకు మీనమేషాలు లెక్కించిన పోలీసులు
- మా పరిధి కాదంటూ జాప్యం
- మూడు పీఎస్‌ల అధికారుల వైఖరిపై సర్వత్రా విమర్శలు
- చివరకు ఘటనాస్థలాన్ని పరిశీలించిన త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీసులు

అనంతపురం: నగరంలోని నేషనల్ పార్క్ వద్ద అభిలాష్(28) అనే యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేశాడు. ఆదివారం రాత్రి నేషనల్ పార్క్ సమీపంలో తీవ్రంగా కాలిన గాయాలతో మృతి చెంది కనిపించాడు. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హత్యా? లేక ఆత్మహత్య అనే అంశంపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్నట్లుగా తెలిసింది. ఆదివారం ఉదయం నుంచి అభిలాష్ కనపడడం లేదని కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు సెల్‌ఫోన్ ఆధారంగా ఆచూకీ తెలిపారు. దీంతో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులు సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా వెళ్లి చూస్తే నేషనల్ పార్క్ సమీపంలో మృతదేహం కనిపించింది. వెంటనే కుటుంబసభ్యులు సమాచారం ఇవ్వడంతో పట్టణ పోలీసులు మల్లగుల్లాలు పడ్డారు. తమ పరిధిలో కాదంటూ తమ పరిధిలో కాదని త్రీ టౌన్, ఫోర్త్ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల అధికారులు గంటకు పైగా చర్చించారు. చివరకు మా స్టేషన్ పరిధి కాదని ఒకరు.. మా స్టేషన్ పరిధి కాదని మిన్నకుండిపోయారు.

పత్రికా ప్రతినిధులు ఫోన్ చేయడంతో త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా, విషయం తెలిసిన వెంటనే స్పందించకుండా మీనమేషాలు లెక్కిస్తూ వచ్చిన పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

వృద్ధురాలి బలవన్మరణం


మృతురాలు లక్ష్మీదేవిబాయి

బ్రహ్మసముద్రం: అనారోగ్య సమస్యలు తాళలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మగానిపల్లి వంక తండాకు చెందిన లక్ష్మీదేవి బాయి (50) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో కుటుంబసభ్యులు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం కడుపు నొప్పి తీవ్రత తాళలేక ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత మృతిపై అనుమానాలు

అనంతపురం: నగరంలోని బుడ్డప్పనగర్‌లో ఓ వివాహిత మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా పెద్దమండం మండలం ఎన్. కొట్టాలపల్లికి చెందిన శ్యామల (28)కు అనంతపురం నగరానికి చెందిన భాస్కర్‌తో 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. కర్నూలు జిల్లా పత్తికొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న భాస్కర్... పత్తికొండలోనే ఉంటూ శని, ఆదివారాల్లో అనంతపురానికి వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో బుడ్డప్పనగర్‌లోని తన ఇంటిపై భాగాన ఉన్న రేకుల షెడ్డులో ఆదివారం శ్యామల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని గుర్తించిన భాస్కర్ వెంటనే శ్యామల కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో వారు అనంతపురానికి చేరుకుని కుమార్తె మృతదేహాన్ని పరిశీలించి, బోరున విలపించారు. కొన్నేళ్లుగా తమ కుమార్తెను అల్లుడు పుట్టింటికి పంపడం లేదని, దీంతో తరచూ తమకు ఫోన్ చేసి బాధపడుతూ ఉండేదని తెలిపారు. శ్యామల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లి రామలక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంధత్వాన్ని జయించి.. క్రికెట్‌లో రాణించి

- ఆంధ్ర జట్టు తరఫున జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణిస్తున్న నల్లమాడ యువకుడు


ట్రోఫీతో క్రికెటర్ గణేష్

నల్లమాడ: కృషి, పట్టుదల ఉంటే అంధత్వం అడ్డురాదని నిరూపించాడు నల్లమాడ మండలం గంగాపురం గ్రామానికి చెందిన గణేష్. పుట్టుకతోనే పాక్షిక అంధత్వంతో బాధపడుతున్నా.. పట్టుదలతో చదువు, క్రీడల్లో రాణించాడు. జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ తన ప్రతిభను చాటుకున్నాడు.

బెంగళూరులో ఉద్యోగం..

గంగాపురం గ్రామానికి చెందిన సరస్వతి, ప్రభాకర్ దంపతులు వ్యవసాయ కూలీలు. వీరి రెండో కుమారుడు గణేష్ తన చదువులు మొత్తం బ్రెయిలీ లిపిలోనే కొనసాగించడం విశేషం. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కదిరి సమీపంలోని మొటుకుపల్లి ఆర్డీటీ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాడు. పదో తరగతి వరకు అనంతపురం శివారున ఉన్న ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో, ఇంటర్‌ను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో, డిగ్రీని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో, పీజీని ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. ప్రస్తుతం బెంగుళూరులోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో సీఎస్ఏ (కస్టమర్ సర్వీస్ అసోషియేట్)గా పనిచేస్తున్నాడు.

క్రికెట్ అంటే అమితాసక్తి..

చిరుప్రాయం నుంచి క్రికెట్ అంటే గణేష్‌కు అమితాసక్తి. ఐదో తరగతి చదువుతున్నప్పుడు క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. ఈ క్రమంలో పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. 2012లో జరిగిన అంధుల క్రికెట్ మ్యాచ్‌లో బీ2 (30 శాతం కంటి చూపు ఉన్నవారు) క్రీడాకారుడిగా తిరుపతి జట్టు తరఫున ఆడి ప్రాబబుల్స్‌కు, అనంతరం ఆంధ్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఫాస్ట్ బౌలింగ్‌లో ప్రత్యేకతను చాటుకుంటూ ఆల్‌రౌండర్‌గా తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఇప్పటి వరకు పలు మ్యాచ్‌లో పాల్గొని వందల సంఖ్యలో వికెట్లు తీయడమే కాక, అదే స్థాయిలో పరుగులూ సాధించాడు. వరుసగా మూడు రంజీ ట్రోఫీలు గెలిచిన ఆంధ్ర అంధుల క్రికెట్ జట్టులో గణేష్ కీలకంగా మారాడు. తాజాగా ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు బెంగుళూరులో జరిగిన ఇండస్ ఇండ్ బ్యాంక్ నగేష్ ట్రోఫీ అంధుల క్రికెట్ టీ20లో విజేత అయిన ఆంధ్ర జట్టులోనూ విశేష ప్రతిభ కనబరిచాడు. ఇండియా జట్టుకు ఆడాలన్నదే తన లక్ష్యమని గణేష్ తెలిపాడు. క్రీడాకారుడిగా తన ఎదుగుదలకు తిరుపతిలోని గట్ల క్రికెట్ క్లబ్ నిర్వాహకుడు గట్ల శ్రీనివాసరెడ్డి సహాయ, సహకారాలే కారణమని ఈ సందర్భంగా గణేష్ పేర్కొంటున్నాడు.

ఆంధ్ర జట్టు తరఫున ఆడి సాధించిన విజయాలు

- 2018 చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో జట్టును గెలిపించడంలో కీలకం.
- 2018లో కోల్‌కత్తాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం అందుకున్నాడు.
- 2019, 2020లో కేరళలో జరిగిన జాతీయ స్థాయి నగేష్ ట్రోఫీలోనూ జట్టు విజయంలో కీలకం.
- 2021లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టును విజయతీరాలకు చేర్చాడు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న కవితాగానం



కవి రఘురామయ్యను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన సాహిత్య మహాసభలు ఆదివారం ముగిశాయి. వైఎస్సార్ జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్ జరిగిన ముగింపు సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు కవులు సామాజిక సమస్యలపై కవితాగానం చేశారు. అందులో భాగంగా నగరానికి చెందిన యువకవి ఆకుల రఘురామయ్య తెలుగు తల్లి విశిష్టతపై వినిపించిన కవిత ఆకట్టుకుంది. అనంతరం వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మూలా మల్లికార్జునరెడ్డి, లయన్ ఖాశీం ఖాన్ డాక్టర్ నాగదత్త గిరిరెడ్డి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆచార్య శలాక రఘునాథశర్మ తదితరుల చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు.

చిన్నారులకు ప్రత్యేకంగా మెడల్స్ అందిస్తాం

అనంతపురం కల్చరల్: ఈనెల 14, 15, 16 తేదీల్లో అనంతలోని లలిత కళాపరిషత్తు వేదికగా సాగే బాలోత్సవంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటూ మెడల్స్ అందజేస్తామని ఐద్వా నాయకురాలు సావిత్రి, రవికాంత్ రమణ వెల్లడించారు. ఆదివారం మీనాక్షమ్మ ఫౌండేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టే బాలోత్సవంలో 63 రకాల ఈవెంట్స్ ఉంటాయని తెలిపారు. బాలోత్సవంలో 2 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. వేడుకలకు వచ్చే పిల్లలతో పాటు తల్లిదండ్రులకు కూడా మూడు రోజుల పాటూ ఉదయం టిఫెన్, మధ్యాహ్నం భోజన వసతి కల్పించామన్నారు. కళా, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయ సంఘాల భాగస్వామ్యంతో సాగే పిల్లల పండుగలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు పరమేష్, చంద్రిక, లింగమయ్య, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంతోష్



అనంతపురం అర్బన్: ఏఐవైఎఫ్ (అఖిల భారత యువజన సమాఖ్య) రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జిల్లాకు చెందిన సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఉన్న సంతోష్ కుమార్‌కు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తామన్నారు. మెగా డీఎస్సీ, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల సాధనకు ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామన్నారు.

సందడిగా రెడ్డి వివాహ పరిచయ వేదిక



బయోడేటాలను పరిశీలిస్తున్న రెడ్డి కులస్తులు

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం రూరల్ పాపంపేటలో నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' సందడిగా సాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రెడ్డి కులస్తులు హాజరయ్యారు. అబ్బాయి, అమ్మాయి బయోడేటాలను పరిశీలించారు. రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు చిన్నరాసి చంద్రమౌళిరెడ్డి మాట్లాడుతూ.. వివాహ పరిచయ వేదికను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇదే వేదికగా పలు వివాహాలు జరిగాయని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయలసీమ రెడ్డి జన సంఘం కార్యదర్శి దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ మంత్రి విశ్వనాథరెడ్డి, సభ్యులు ముచ్చుకోట నారాయణ రెడ్డి, నందికొట్కూరు రమణారెడ్డి, దయానందరెడ్డి, పోతిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక సబ్‌జైళ్ల అధికారి కార్యాలయంలో ఆదివారం జిల్లా కారాగార శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కేఎస్ ఫజుల్‌హక్ ఆధ్వర్యంలో 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు.

అనంతపురం నగరపాలక సంస్థను సమస్యలు వెంటాడుతున్నాయి. సమస్యల పరిష్కారంలో టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, రెవెన్యూ, తదితర విభాగాల్లో కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో ఇక్కడ పని చేయలేం బాబోయ్ అంటూ కమిషనర్లు మారిపోతున్నారు. ఇప్పటికే నలుగురు కమిషనర్లు ఇక్కడి నుంచి వెళ్లిపోయారంటే ఇక్కడ వేధింపులు ఎలా ఉంటాయో చెప్పాల్సిన పని లేదు. ఇటువంటి పరిస్థితుల్లో నూతనంగా నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న కమిషనర్ బాలస్వామికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇతని సారథ్యంలోనైనా నగరపాలక సంస్థ గాడిలో పడుతుందో లేదో చూడాలి.




సార్‌కు సమస్యల స్వాగతం

- కమిషనర్ బాలస్వామి పాలనలో నగరపాలక సంస్థ గాడిలో పడేనా?
- కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో మారుతున్న కమిషనర్లు
- అస్తవ్యస్తంగా పాలన, పడకేసిన పారిశుధ్యం
- నిద్రమత్తులో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థ అస్తవ్యస్తంగా మారింది. టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, రెవెన్యూ, తదితర విభాగాల్లో కొందరు అధికారులు, సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. తమకేం పట్టదన్న ధోరణిలో వారు విధులు నిర్వర్తిస్తుండటంతో నగరంలో అనధికార నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలు, డబుల్ ట్యాప్ కనెక్షన్లు, పారిశుద్ధ్య సమస్య, కుక్కల బెడద వెంటాడుతోంది. ప్రధానంగా రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అభివృద్ధి పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్లు అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. ప్రతి పనికీ పెద్ద ఎత్తు కమిషన్ కావాలంటూ ఓ ప్రజాప్రతినిధి అనుచరులు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్లు ముందుకురాని పరిస్థితి. కమీషన్ కొట్టు.. కాంట్రాక్ట్ పట్టు అన్న ధోరణిలో పలువురు ప్రజాప్రతినిధులు దందా మొదలుపెట్టారు. అభివృద్ధి పనులు జరిగితే నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఇప్పటికే నగరంలోని సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు, ఆర్‌ఎఫ్ రోడ్డు, జేఎన్‌టీయూ, తిలక్ రోడ్డు, టవర్ క్లాక్, తదితర ప్రధాన రోడ్లతో పాటు వివిధ డివిజన్‌లలో రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్యాచ్ వర్క్ పనులు చేపట్టినా.. రెండు రోజులకే రాళ్లు తేలుతున్నాయి. ఆ పనుల్లోనూ నాణ్యత లేదు.

కుక్కల బెడద



ప్రధానంగా నగరవాసులకు కుక్కల బెడద పట్టిపీడిస్తోంది. గడిచిన నాలుగు నెలల్లో 1000 మందికిపైగా కుక్కకాటు బాధితులు సర్వజనాస్పత్రిలో ఏఆర్‌వీ వేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి నిర్లక్ష్యంతో పాటు సచివాలయ అధిక సంఖ్యలో పారిశుద్ధ్య కార్యదర్శులు ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తుండటంతో నగరం కంపు కొడుతోంది.

చూసీ..చూడనట్లుగా టౌన్ ప్లానింగ్

టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో నగరంలో ఏ వీధికెళ్లినా.. అనధికార నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. ప్లాన్ ఒకలా తీసుకుని నిర్మాణం మరోలా చేపడుతున్నారు. నగర పరిధిలో ఇప్పటికే 200 భవనాలకు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. మరో 60 భవనాలకు చార్జ్‌షీట్లు వేయాల్సి ఉంది. నిర్మాణం చేపట్టే సమయంలోనే ప్లానింగ్ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనధికార నిర్మాణాలు అడ్డు చెప్పలేదు. చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో నిర్మాణదారులు ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని పలువురు అధికారులు నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. అడ్వైటైజ్‌మెంట్ ఏజెన్సీలతో కుమ్మక్కై క్యాండీటవర్, లాలీపప్స్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అందుకోసం రూ.లక్షల్లో లోపాయికార ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. రూ.కోట్లు విలువ చేసే నగరపాలక సంస్థ ఆస్తులను పరిరక్షించడంలో విఫలమయ్యారు. ఇటీవల నగరపాలక సంస్థకు చెందిన రూ.10 కోట్లు విలువ చేసే నగరపాలక సంస్థ స్థలంలో నిర్మాణం చేపడితే కనీసం ఏసీపీ శిరీష ఘటన స్థలానికి వెళ్లలేదు. దీనిని బట్టి చూస్తే వీరు ఏ స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారో అర్థం చేసుకోవాలి.

చెత్త సేకరణ అంతంతే..



నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో రోజూ 140 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. కాగా పూర్తిస్థాయిలో చెత్త సేకరణ జరగకపోవడంతో నగరంలో ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపిస్తోంది. ప్రస్తుతం రోజూ వంద టన్నుల చెత్త కూడా కంపోస్టుకు తరలించడం లేదు. గతంలో ఇంటింటా చెత్త సేకరణ సజావుగా జరిగేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. అద్దె ట్రాక్టర్లను తీసుకుంటామని అధికారులు కాలయాపన చేస్తున్నారు.

అనంత సాహిత్యంలో జూపల్లిది ప్రత్యేక స్థానం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యంలో భిన్నమైన వ్యక్తిత్వంతో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న జూపల్లి ప్రేమ్‌చంద్ ఆదర్శప్రాయుడని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి అన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం ఈశ్వరరెడ్డి అధ్యక్షతన ప్రేమ్‌చంద్ రాసిన 'ఆధునిక తెలుగు వచన కవిత్వం-విభిన్న ధోరణులు' పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు ఆవిష్కరించారు. తూముచర్ల రాజారాం పుస్తక సమీక్ష చేశారు. సీనియర్ జర్నలిస్టు జంగా గౌతమ్, సీనియర్ రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, డాక్టర్ నానీల నాగేంద్ర, తస్నీరు నాగేంద్ర తదితరులు జూపల్లి సాహిత్య విశిష్టతపై మాట్లాడారు. దళిత బహుజన వాదాల దృక్పథంతో పనిచేసిన జూపల్లి నిచ్చెనమెట్ల లోలకం, ఆవేదా గ్రంథాల ద్వారా సరికొత్త ఒరవడిని సృష్టించారన్నారు. ఆయన పోషించిన పలు కీలక బాధ్యతలు కూడా ఆయా సంఘాలకు పేరు తెచ్చిపెట్టాయని గుర్తు చేసుకున్నారు. అనంతకు ముందు జూపల్లికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో జనప్రియ కవి ఏలూరు యంగన్న, హాస్యరచయిత తరిమెల అమరనాథరెడ్డి, జూపల్లి శంతన్, అపర్ణ, రియాజుద్దీన్, చెట్ల ఈరన్న, నాగలింగయ్య, మహాబోధి కృష్ణమూర్తి, రసూల్, జూటూరు షరీఫ్, తెలుగు వెలుగు టీవీరెడ్డి, యువ రచయిత్రి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య

అనంతపురం అర్బన్: కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో సమాఖ్య జిల్లా కార్యదర్శి సి.వి.హరికృష్ణతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. గీత పని వారికి టీఎఫ్‌టీ లైసెన్స్‌లు ఇవ్వాలన్నారు. ఈత వనాలకు భూమి కేటాయించాలని కోరారు. కల్లుగీత కార్మికులను టీసీఎస్‌లో సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం గీత పనివాళ్ల సమాఖ్య జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

జిల్లా కమిటీ ఇదే..

గీత పనివాళ్ల సమాఖ్య గౌరవాధ్యక్షుడిగా కొండప్ప, అధ్యక్షుడిగా సంగమేశ్వర, ప్రధాన కార్యదర్శిగా ఈ.రఘు, ఉపాధ్యక్షులుగా ఈడిగ ప్రసాద్, శంకరయ్యను ఎన్నుకున్నారు. అదే విధంగా సహాయ కార్యదర్శిగా సూరి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఈ.సంగప్ప, సభ్యులుగా రామకృష్ణ, నాగభూషణ, తదితరులను ఎన్నుకున్నారు.

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలి



పంపనూరు వద్ద హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

ఆత్మకూరు: హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేస్తే అడ్డుకుంటామని సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పంపనూరు వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాకు తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 1988లో కృష్ణా జలాలకు రాయలసీమకు ఇవ్వాలని శ్రీశైలం నుంచి హంద్రీ-నీవా పథకాన్ని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కింద రాయలసీమ జిల్లాలో 6.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 40 టీఎంసీల నీటిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొత్త ప్రతిపాదనలతో 40 టీఎంసీల నుంచి 65 టీఎంసీలకు పెరిగినట్లు గుర్తు చేశారు. కాలువ సామర్థ్యం తక్కువ ఉండటంతో అధిక నీరు తీసుకోలేకపోతున్నారు. నిర్దేశించిన ఆయకట్టుకు నీరు అందించాలంటే కాలువను పది వేల క్యూసెక్కులకు పెంచాలని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కాలువను వెడల్పు చేయకపోగా.. రెండవ దశకు లైనింగ్ వేయాలని నిర్ణయించి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆయకట్టుకు నీరు ఇవ్వకుండా కాలువలో నీరు ప్రవహించడానికి లైనింగ్ వల్ల కాంట్రాక్టర్లకు లాభం చేకూరుతుందన్నారు. అనంత జిల్లాకు ఇబ్బంది కలిగేలా ఉన్న ఈ లైనింగ్ పనులు తక్షణమే ఆపాలని కోరారు. కాలువ వెడల్పు చేసి ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రామకృష్ణ, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



హోమం చేస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శృంగేరీ శారదా శంకర మఠంలో సాగుతున్న 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ హోమాలు, విశేష అలంకార సేవలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు నిర్వహించారు. గణపతి, రుద్ర, చండీ హోమాలు చేపట్టారు. పవిత్ర జలాలను తెచ్చి వేదసహితంగా పూర్ణాహుతి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిచ్చి మఠంలో కొలువైన వివిధ దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రవచనకర్త సంతోష్‌కుమార్ ఘనాపాఠి ఉదయం ప్రవచనంలో సనాతన ధర్మం, వేద ప్రామాణ్యత ప్రాధాన్యాన్ని సాయంత్రం శృంగేరీ పీఠం విశిష్టతను తెలియజేశారు. ఆస్తిక జనులు ఆధ్యాత్మిక ప్రగతిని కోరుకుంటారని.. అటువంటి వారికి తత్వాన్వేషణ, సోపాన క్రమాన్ని భారతీయ ధర్మం వివరిస్తుందన్నారు. సనాతన రుషులు అందించిన జ్ఞానాన్ని అందరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం శంకర మఠం ప్రతినిధి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ప్రవచనకర్తను సత్కరించారు. రాత్రి శారదామాతకు నివేదించిన తీర్థప్రసాదాల వితరణ జరిగింది.

'సామాన్యులకు న్యాయం చేయని బడ్జెట్'

అనంతపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భ్రమజనితమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం, బీఎస్సీ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై సదస్సు జరిగింది. కేంద్రం కన్వీనర్ ఏజీ రాజమోహన్, బీఎస్సీ నాగభూషణం, సామాజిక వేత్త సత్యబోసు తదితరులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, సామాజిక రంగానికి కోతలు పెట్టిందన్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినా అవి కోతలేనని ఎద్దేవా చేశారు. విద్యా, వైద్యానికి నిధుల కేటాయింపు అంతంతమాత్రంగా ఉందన్నారు. గతంలో వీటికి రూ.60 వేల కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ.56 వేల కోట్లు మాత్రమే కేటాయింపులు ఉన్నాయని విమర్శించారు. అలాగే ప్రొఫెసర్ బావయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్ శక్తులే లాభపడతారన్నారు. అంకెల గారడీ మాత్రమే జరిగిందన్నారు. అలాగే సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ బడ్జెట్ గురించి ప్రజల్లో తీసుకెళ్లాలని వామపక్షాలు తీర్మానించినట్లు వెల్లడించారు. ఈనెల 14 నుంచి 23 వరకు ప్రచారోద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఐ జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, డాక్టర్ కొండయ్య తదితరులు కేంద్ర ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి తిరునాల



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల ఘనంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, ఏకవార రుద్రాభిషేకం సహస్ర నామార్చన తదితర పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే గాక జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 సాలగ్రామ శివలింగాలకు భక్తులు పూజలు చేపట్టారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గాజుల అంగళ్లు, తినుబండరాలు, చెరకు, బొరుగుల అంగళ్లు ఏర్పాటు చేశారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

భక్తులకు అన్నదానం

తిరునాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏటా మాదిరిగా రెండవ ఆదివారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తన తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి తల్లి వెంకటసుబ్బమ్మ, సోదరులు కొండారెడ్డి, శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

మాఘమాస సందడి



మహా గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో సర్పరూపుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘమాస సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహా గణపతి హోమం నిర్వహించారు. స్వామికి అర్చనలు, పంచామృతాభిషేకాలతో పాటు బంగారు కవచ సేవ, పల్లకీ సేవ, ఆకుపూజ చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేశారు. అనంతరం స్వామికి మూల మంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల ఏర్పాటు



ఎంపికైన బసంపల్లి గ్రామ కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బసంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కక్కలపల్లి మహేష్, ఉపాధ్యక్షులుగా కుణుతూరు శంకర్, చిట్రా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా కుమ్మర నాగరాజు, నాగరాజు, కార్యదర్శులుగా పెన్నోబిలేసు, రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా ఎర్రిస్వామి, రాము, శివయ్య, వెంకటేష్, అక్కన్న, వెంకట్రాముడు, నాగిశెట్టి, భాస్కర్, లక్ష్మీనారాయణ, మనినాయక్, చంద్ర, రామాంజనేయులు, శ్రీరాములు, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నారాయణ స్వామి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

అనంతపురం కల్చరల్: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా గిరిజనుల పరిస్థితులు మారలేదన్నారు. ఎంతో మంది గిరిజనులకు కనీసం గూడు కూడా సరిగా లేదని వాపోయారు. మన రాష్ట్రంలో 40 లక్షల మంది దాకా గిరిజనులు ఉన్నప్పటికీ వారికి సంక్షేమ ఫలాలు అందడం లేదని పేర్కొన్నారు. తండాలు, ఎరుకుల కాలనీల్లో కనీస సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సంత్ సేవాలాల్ జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే ఆనంద్, జాతీయ సలహాదారుడు నారాయణ స్వామి నాయక్, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమార్, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డీకే రామలింగం, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే వైస్ చాన్సలర్ల నియామకంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వీ.ఎం రవిశంకర్ కోరారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో 26 యూనివర్సిటీలకు గాను ఆరింటికి తగ్గకుండా దళితులకు ఇవ్వాలన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 164 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని సూచిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వం వారి అభివృద్ధి కోసం సామాజిక న్యాయం పాటిస్తుందని నమ్ముతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు సుగప్ప తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతి



పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణనాయక్ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈయన స్వస్థలం పుట్టపర్తి మండలం పెడపల్లి. ఈయనకు భార్య శాంతిబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. వారి వ్యవసాయ తోటలో అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్, పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ లింగన్న, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, హరినాథ్, లక్ష్మీనారాయణ, గాండ్ల హరినాథ్, సిబ్బంది, బంధువుల సమక్షంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.